



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com

ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 662 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర ఆదివారం15 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం








## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

-దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు

-పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస

2



## బడ్జెట్ స్పీచ్‌లో అన్నీ అబద్ధాలే

గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టు ఉందని వ్యాఖ్య

వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి

2

## క్యాన్సర్ రోగులకు కేంద్రం ఉపశమనం...

-జిల్లా ఆసుపత్రుల్లో కీమోథెరపీ సేవలు

- దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ఏర్పాటు
- అందుబాటులోకి రానున్న కీమోథెరపీ సేవలు
- రోగులకు ఉచితంగా అవసరమైన మందుల సరఫరా
- ప్రయాణ భారం, ఆర్థిక ఇబ్బందులు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కేంద్రాల ఏర్పాటు



2



## రూ. 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్...

- రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల
- రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు

2

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.3,32,205 కోట్లు కేటాయిస్తూ.. బడ్జెట్ కేవలం పద్దుల ప్రకటన కాకుండా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి గల ఒక సంకల్పం అని మంత్రి తెలిపారు. అందులో రూ.2,56,143 కోట్లను రెవెన్యూ వ్యయాలకు, రూ.53,915 కోట్లను మూలధన వ్యయాలకు, రూ.22,002 కోట్ల రెవెన్యూ లోటు, రూ.75,868 కోట్ల ద్రవ్య లోటును బట్టి రూపొందించినట్లు పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు కేటాయించగా.. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయించారు. సర్దుబాటు నిధికి రూ.1,500 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవలకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్ పథకానికి రూ.4,000 కోట్లు కేటాయించారు.

## కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప కేటాయింపులు లేవు

- మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేసి మోసం చేశారని విమర్శ
- ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర అప్పుల లెక్కలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని వ్యాఖ్య
- ఈ బడ్జెట్ ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని దెబ్బతీసిందని తీవ్ర విమర్శ



2







# రూ. 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్...

ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు, పాఠశాల విద్యాశాఖకు రూ.32,308 కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.22,942 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయించారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,660 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.6,105 కోట్లు, హోంశాఖకు రూ.9,165 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ.14,539 కోట్లు కేటాయించారు. జలవనరుల శాఖకు రూ.18,224 కోట్లు, హాస్టళ్లు, గురుకులాలకు రూ.300 కోట్లు, విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ.3,836 కోట్లు, మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, ఎన్టీఆర్ భరోసాకు రూ.27,719 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ అప్పులపై వడ్డీరేట్లను తగ్గించడం, సరిగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం వంటి చర్యలతో ప్రభుత్వం సంవత్సరానికి లక్ష్యానికి చేరే విధంగా రూ.1,658 కోట్ల ఆదా సాధించిందని చెప్పారు. పంచాయతీలు, మున్సిపాలిటీలకు రూ.3,797 కోట్లు విడుదల చేసి, పెండింగ్ లో ఉన్న బకాయిలను క్లియర్ చేసినట్లు కూడా వివరించారు. ఇంకా కేంద్రప్రాయోజిత పథకాలకు రూ.18,701 కోట్లు విడుదల చేసి వాటి అమలును పెంచారు. ప్రభుత్వ విధానాలను సరళీకరించడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పౌర సేవల మెరుగుదల కోసం పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. రాష్ట్రానికి ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించి, సంపదను సృష్టించేందుకు స్వా వెల్త్ ఫండ్‌ను రూ.100 కోట్ల సీడ్ కార్పస్‌గా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పునర్వ్యవస్థీకరణలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం, మీవీజు అభివృద్ధి, స్వచ్ఛ ఇంధన విధానం, ఆవిష్కరణ–స్టార్టప్ విధానం, పర్యాటక విధానాల ఆధునీకరణ వంటి 26 విధానాలను ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 బడ్జెట్‌లో అమరావతి నిర్మాణం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 97 పనులకు రూ.57,868 కోట్లు అనుమతులు ఇచ్చి రాజధాని పనులను వేగంగా ముందుకు తీసుకువస్తున్నారని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అమృత్ 2.0, యూఐడీఎఫ్, ఏఐఐబీ ద్వారా 506 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, ఇవన్నీ 2027 డిసెంబర్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ప్రధాన నగరాల్లో మెట్రో రైలు, ప్రధానమంత్రి ఆవాస్, ఎన్టీఆర్ నగర్స్ కింద 25 లక్షల గృహాలను ఇవ్వడం ద్వారా పేదలకు స్వంత ఇల్లు కలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు.

## కూటమి బడ్జెట్‌లో నాయకుల పేర్లు తప్ప

# కేటాయింపులు లేవు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆత్మస్తుతి... పరనింద అన్నట్టు బడ్జెట్ ప్రసంగం సాగిందని విమర్శించారు. ఇది అంకెల గారడీతో కూడిన పసలేని బడ్జెట్ అని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ పేర్లను పదిసార్లు ప్రస్తావించడం తప్ప ప్రజలకు మేలు చేసే అంశాలు ఏవీ లేవని ఆయన దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ ప్రజల్లో ఉన్న కొద్దిపాటి ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడా దెబ్బతీసిందని, ఇది మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో బొత్స మాట్లాడుతూ, ప్రతి రంగంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు. మహిళా సాధికారతపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతి ఇంట్లో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "గతంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి, వారిలో పారిశ్రామిక స్ఫూర్తిని నింపడానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకాన్ని తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సున్నా వడ్డీని అమలు చేశాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా ఆలస్యం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. కానీ ఈ ప్రభుత్వం వచ్చి 19 నెలలైనా ఆ సున్నా వడ్డీ పథకం ఏమైందో తెలియదు. బడ్జెట్‌లో దానికి కేటాయింపులు లేవు. ఎలాంటి ఆర్థిక చేయూత లేకుండా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎలా మారుస్తారో చంద్రబాబు చెప్పాలి. ఇది మహిళలను మోసం చేయడం కాదా?" అని బొత్స ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం (వీ=జు+రా) నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం కోత పెట్టిందని బొత్స ఆరోపించారు. "గతంలో ఉపాధి హామీ పథకం కింద 100 శాతం నిధులను కేంద్రమే భరించేది. ఇప్పుడు కేంద్రం నిబంధనలు మార్చి మెటీరియల్, లేబర్ కాంపోనెంట్లలో 40 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో ఏటా సగటున రూ. 5,000 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసేవారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రం కనీసం రూ. 2,000 కోట్లు కేటాయించాలి. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే చూపించారు. మిగిలిన బ్యాలెన్స్ సంగతేంటి? అంటే ఈ పథకాన్ని కూడా నీరుగార్చబోతున్నారా?" అని ఆయన నిలదీశారు. రాష్ట్ర అప్పుల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని బొత్స ఆరోపించారు. రాష్ట్ర విభజన నుంచి వారసత్వంగా రూ. 9.46 లక్షల కోట్ల అప్పులు వచ్చాయని చెప్పడం సత్యదూరమని అన్నారు. "మా ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్లతో కలిపి మేం చేసిన అప్పు కేవలం రూ. 3 లక్షల కోట్లు మాత్రమే. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం రూ. 2.30 లక్షల కోట్ల అప్పు చేసింది. వాస్తవాలు ఇలా ఉంటే, అప్పుల భారాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని బొత్స వివరించారు. ఈ బడ్జెట్‌లో కేవలం ప్రగల్భాలు తప్ప, నిర్దిష్ట కేటాయింపులు, ప్రజలకు భరోసా ఇచ్చే అంశాలు ఏవీ లేవని విమర్శించారు

# సామాజిక సమానత్వానికి ప్రతీకగా

# దామోదరం సంజీవయ్య.

### .విద్య ద్వారానే కుల వివక్షత నిర్మూలనం సాధ్యం.

### ఘనంగా దామోదరం సంజీవయ్య 105వజయంతి వేడుకలు.

### .జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

కర్నూలు , ఫిబ్రవరి 14,

సామాజిక సమానత్వానికి ప్రతీకగా దామోదరం సంజీవయ్య, విద్య ద్వారానే కుల వివక్షత నిర్మూలనం సాధ్యమని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. శనివారం దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నుండి నంద్యాల చెక్ పోస్ట్ వరకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం నంద్యాల చెక్ పోస్ట్ లో ఉన్న విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి అక్కడే ఏర్పాటు చేసిన సభలో అధికారులు, వివిధ కుల సంఘ నాయకులతో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 1925 ప్రాంతంలో దళితుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని, కుల వివక్షత తీవ్రంగా వ్యాపించి ఉండేదని గుర్తుచేశారు. అటువంటి పరిస్థితుల్లో కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన దామోదరం సంజీవయ్య జన్మించి, కృషి, పట్టుదలతో రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఎదగడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు కూడా ఎన్నో అడ్డంకులను అధిగమించి చదువుతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు లభించాయని, ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు, ముఖ్యంగా అట్రాసిటీ చట్టం అమల్లో ఉన్నాయని తెలిపారు. గతంతో పోలిస్తే సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. విద్య ద్వారానే ఈ వివక్షతను పూర్తిగా రూపుమాపగలమన్నారు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కార్మికుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చారని, భూమిలేని నిరుపేదలకు భూముల పంపిణీకి చట్టపరమైన చర్యలు చేపట్టారన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, విద్య ద్వారానే ఉన్నత భవిష్యత్తు సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఆదోని పట్టణానికి చెందిన తాయప్పకు సామాజిక సంక్షేమ శాఖలో వాచ్‌మెన్‌గా నియామక పత్రాన్ని జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీలు, క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ మెమెంటోలు అందజేసి అభినందించారు. ముందుగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, సంఘ నాయకులు రాధాకృష్ణ, జ్యోతి, సోమన్న, చంద్రప్ప, వెంకటేశ్వర్లు, శ్రీను, రాజశేఖర్, తదితరులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, మెప్మా పిడి శ్రీనివాసులు, వివిధ సంఘ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్ స్పీచ్‌లో అన్నీ అబద్ధాలే

ఏపీ శాసనసభలో ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు

## దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

# క్యాన్సర్ రోగులకు

# కేంద్రం ఉపశమనం...

క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేళ్లలో ఈ కేంద్రాలను నెలకొల్పనుండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 200 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్ణయంతో కీమోథెరపీ వంటి కీలక చికిత్సలు రోగుల నివాస ప్రాంతాలకు దగ్గరగా అందుబాటులోకి రానున్నాయి. క్యాన్సర్ చికిత్స కోసం రోగులు నెలల తరబడి ఎన్నోసార్లు ఆసుపత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కీమోథెరపీ కోసం నగరాల్లోని పెద్ద ఆసుపత్రులకు ప్రయాణించడం శారీరకంగా, ఆర్థికంగా పెనుభారంగా మారుతోంది. ప్రయాణం, బస, ఆహారం, రోజువారీ వేతనం కోల్పోవడం వంటి ఖర్చులు కుటుంబాలను కుంగదీస్తున్నాయి. కీమోథెరపీ తీసుకునే రోగులు బలహీనంగా ఉండటంతో, వారికి సహాయకులు తోడుగా వెళ్లాల్సి రావడం అదనపు భారం. ఈ ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం జిల్లాస్థాయిలో ఈ డే కేర్ కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందు ప్రభుత్వం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిసి లోటుపాట్లపై అధ్యయనం చేసింది. క్యాన్సర్ కేసుల సంఖ్య, రోగుల భారం, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా జిల్లాలను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లాల్లోని వైద్యులు, నర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాల్లో 4 నుంచి 6 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కీమోథెరపీ మందుల మోతాదు, దుష్ప్రభావాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల ఎదుర్కోవడం, మందుల భద్రత వంటి అంశాల్లో వారికి శిక్షణనిచ్చారు. ఈ కేంద్రాల ద్వారా అవసరమైన కీమోథెరపీ మందులను ఉచితంగా అందించనున్నారు. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అధికంగా ఉండే నేపథ్యంలో ఈ నిర్ణయం రోగులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. మందుల కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం సరఫరా వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోంది.

# ఉండవల్లిలో 'ఇల్లే వేదిక'..

# నేతలతో కలిసి భోజనం చేసిన

# నారా లోకేశ్...

### ఉండవల్లిలో ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం

### గుంటూరు, విజయవాడ నేతలతో ఆత్మీయ కలయిక కార్యక్రమం

### సమస్యల పరిష్కారంపై నేతలకు నివేదిక అందజేత

### హాజరైన మహిళలకు మంగళగిరి చేనేత చీరల బహూకరణ

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న 'ఆత్మీయ కలయిక – ఇల్లే వేదిక' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని తన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ... అందరూ కలిసి ఒకేచోట భోజనం చేస్తూ, మాట్లాడుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన వివిధ సమస్యలపై ఒక నివేదికను వారికి అందించినట్లు వివరించారు. వారు ఇచ్చిన విజ్ఞప్తులలో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చిన మహిళలకు మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసినట్లు లోకేశ్ తెలిపారు. గత కొన్ని రోజులుగా మంత్రి లోకేశ్ కూటమిలోని ప్రజాప్రతినిధులతో ఇలాంటి సుహృద్భావ సమావేశాలు నిర్వహిస్తుండటం ద్వారా పార్టీ శ్రేణులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# శీర్షిక : శివోహం

నిశి రాత్రిలో
త్రయోదశి రోజున
అర్థరాత్రి సమయాన
లింగోద్భవ తరుణాన
శివరాత్రి పర్వదినం నాడు
ఉపవాస దీక్షను చేపట్టి
కఠిన జాగారం చేసి
శివ నామస్మరణ గావిస్తూ
శివపార్వతుల కళ్యాణంను వీక్షించిన కలుగును అనంత పుణ్యం
జరుగును సకల పాప సంహారం!
త్రినేత్ర ధారుడై
పార్వతీ పతియై
వినాయకుని పితయై
శిరమున గంగతో
కంఠమున సర్పంతో
నుదుటిన విభూది రేఖలతో
స్మశాన వాటికలో
త్రిలోక సంరక్షకుడై
భక్తుల కోర్కెలు తీర్చే భోళా శంకరుడై
భక్తులకు కొంగు బంగారమై
కైలాస పర్వత వాసియై
భక్తుల హృదయ నివాసియై
శివోహం అంటూ భక్తుల నామ స్మరణకు ముదమొందుచూ
భక్తుల మొక్కులను తీర్చుతూ
త్రిలోకాలను సంరక్షించే చంద్ర శేఖరుడు శివుడు
ఆయనే అన్నిటికి కర్త కర్మ క్రియ
సకలము ఆయనకు ఎరుక
శివరాత్రి రోజున ఆయన్ను
చంద్ర శేఖర రక్షమామ్ అంటూ
ప్రార్ధిద్దాం ఏమారక !!!



- డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)
తెనాలి
చరవాణి : 7416638823
ప్రక్రియ : వచన కవిత

# 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ కృషిచేసిన ఎంపీకి సత్కారం




నందిగామ, సింహగర్జన ప్రతినిధి (లక్ష్మి), ఫిబ్రవరి 14 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చిన్నిని వారి కార్యాలయంలో నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ మంజూరు చేయడంలో ఎంపీ విశేష కృషిని కొనియాడుతూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ తన కృషి ఫలితంగా 2018లోనే నందిగామలో 20 పడకల ఆయుష్ హాస్పిటల్ ప్రారంభమైందని తెలిపారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆసుపత్రి పనులు కుంటుపడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నందిగామ ప్రముఖుల ఆకాంక్ష మేరకు ఆయుష్ హాస్పిటల్‌ను మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రతిపాదన రూపొందించి ఎంపీకి సమర్పించామని వెల్లడించారు. ఆ ప్రతిపాదనను ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, సంబంధిత కేంద్ర మంత్రితో చర్చించగా, నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ కేటాయించిన విషయాన్ని ఆయన తెలియజేసినట్లు సౌమ్య చెప్పారు. ప్రస్తుతం పరిపాలన అనుమతులు లభించాయని, స్థల సేకరణ ప్రక్రియ పూర్తయి, ప్రభుత్వం కొద్ది రోజుల్లో స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించనుందని ఎంపీ వెల్లడించినట్లు తెలిపారు. అవసరమైన నిధులు కూడా త్వరలోనే విడుదల కానున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ చిన్నిలకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నందిగామ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్యసేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నువ్వొస్తేనే..

చినుకులు నెమ్మదిగా మొదలై
జల్లుగా మారి
మూన్నాళ్ల ముసురు పట్టి
వెలిసిపోనంటుంది
కురిసేది వాన కాదు
నీ జ్ఞాపకాల జడివాన
మెరిసేది మెరుపు కాదు
నీ దరహాసం
ప్రవహించేది వరద కాదు
నా విరహం

ఎన్నిసార్లు ఒంటరి కొంగనై
విహంగ వీక్షణం చేస్తున్నా..
నీ జాడే తెలియడం లేదు
నువ్వు ఎంతకీ రాక
నాతో నేను ఉండలేక
కాలు కాలిన పిల్లిలా
ఇల్లంతా తిరుగుతున్నాను

ఇంత దగ్గరగా ఉన్నావే
ఒక్కసారి రావచ్చు కదా!?

ఈ అల్లరి చినుకుల తొలకరిని
గేయంగా రాసేస్తాను
ముంచనున్న వర్షఋతువును
మహాకావ్యంగా మార్చేస్తాను.

- మౌనశ్రీ మల్లిక్
8919338546



# నువ్వెవరు

ఆలోచన నాదైనప్పుడు
ఆచరణ నాదైనప్పుడు
అన్వేషణ నాదైనప్పుడు
నా అంతరంగాన్ని అణచడానికి నువ్వెవరు ..?

జీతం నాదైనప్పుడు
జీవితం నాదైనప్పుడు
జీవన గమనం నాదైనప్పుడు
నా జీవన సిద్ధాంతంలో రాద్ధాంతం చేయడానికి
నువ్వెవరు....?

భాష నాదైనప్పుడు
బాధ నాదైనప్పుడు
భావోద్వేగం నాదైనప్పుడు
నా అంతర్మధనంలో పెత్తనం చేయటానికి నువ్వెవరు....?

కల నాదైనప్పుడు
కష్టం నాదైనప్పుడు
కన్నీళ్లు నాదైనప్పుడు
కలలుగనే నా స్వేచ్ఛకు
కలతలు సృష్టించడానికి నువ్వెవరు ..?

అక్షరం నాదైనప్పుడు
పదం నాదైనప్పుడు
వాక్యం నాదైనప్పుడు
పద,వాక్యాలతో నేను ప్రయాణం చేస్తున్నప్పుడు. నన్ను
నిలువరించడానికి నువ్వెవరు

నన్ను నేనుగా ముందుకెళ్తుంటే నన్ను నీవుగా వెనక్కు
లాగటానికి నువ్వెవరు...?

-



రాధాకృష్ణ దాసరి
బుడ్డారెడ్డి పల్లె
జోగులాంబ గద్వాల జిల్లా
ఫోన్ : 9640664774

# అమర వీరుల జ్ఞాపకం పుల్వామా వీరగాథ

అమర వీరుల జ్ఞాపకం : పుల్వామా వీరగాథ
ఫిబ్రవరి 14, 2019
దేశమంతా ప్రేమ వసంతంలో మునిగి తేలుతున్న వేళ, జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై ఒక పెను విషాదం నిశ్శబ్దంగా ముంచుకొచ్చింది. సుమారు 2,500 మంది సీఆర్పీఎఫ్ (జవాన్లు) జవాన్లు తమ సెలవులను ముగించుకుని, మాతృభూమి రక్షణ కోసం విధులకు హాజరవుతున్న వేళ అది.
ఆఖరి చూపు.. అంతులేని ధైర్యం ఆ కాన్వాయ్‌లో ఉన్న ప్రతి జవాను గుండెల్లో తమ కుటుంబం పట్ల ప్రేమ, దేశం పట్ల అంకితభావం ఉంది. కొందరు తమ పసిబిడ్డల ఫోటోలను చూసుకుంటూ మురిసిపోతుంటే, మరికొందరు త్వరలోనే తిరిగి వస్తానని భార్యలకు ఇచ్చిన మాటను గుర్తు చేసుకుంటున్నారు. కానీ విధి మరోలా తలచింది. పుల్వామా సమీపంలో జరిగిన ఆ అకస్మాత్తు ఆత్మాహుతి దాడి భారతావనిని ఉలిక్కిపడేలా చేసింది.

**- త్యాగం - అమరత్వం**

ఆ భీకర దాడిలో 40 మంది వీర జవాన్లు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వారు చిందించిన రక్తం ఈ గడ్డపై చెదరని ముద్ర వేసింది. వారు కేవలం సైనికులు మాత్రమే కాదు.. ఒక తల్లికి ఆసరా, ఒక భార్యకు తోడు, ఒక బిడ్డకు మార్గదర్శకులు. దేశం కోసం వారు చేసిన త్యాగం ముందు హిమాలయాలు కూడా తలవంచుతాయి.

**- భారతావని నివాళి**

నేడు మనం స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తున్నామంటే, దానికి కారణం సరిహద్దుల్లో రక్షణగా నిలిచిన అటువంటి మహానుభావుల బలిదానమే.
వారి భౌతిక కాయాలు మట్టిలో కలిసినా, వారి కీర్తి మాత్రం ప్రతి భారతీయుడి గుండెల్లో జ్వాలై రగులుతూనే ఉంటుంది.



"దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులు మరణించరు.. వారు చరిత్ర పుటల్లో అమరులుగా జీవిస్తూనే ఉంటారు."
వీర జవాన్లకు ఇవే మా అశ్రునయనాల ఘన నివాళులు!

మీ...
డా సునీల్ కుమార్ యాండ్ర
సంపాదకుడు, సింహగర్జన తెలుగు ఈ దిన పత్రిక
భారతీయుడు

# రెక్కలు తొడిగిన స్వప్నం

మిన్నుని తాకాలనుకుని – మన్నుని
చేరాయి ఆశలు
ఆవేశపు రెక్కలు టపటప కొట్టుకుని
నేలకొరిగాయి

నిలకడ లేని వ్యాపకాల చుట్టూ
వ్యాకోచిస్తున్నాయి కోరికలు
విధ్వంస పూరిత విరోధ మాటల తాకిడికి
మనసంతా మసక బారింది

అవని చుట్టూ ఆశయాలు ఆక్రోశిస్తూ
భ్రమిస్తున్నాయి
పక్షపాతాన్ని ప్రళయంగా మార్చి
ప్రత్యామ్నాయాలన్నీ పల్లకిలో ఊరేగుతుంటే

విలయమై, విస్తృతమై, ఓంకారనాథమై
విదుర జ్ఞానాన్ని ఆత్మార్పణం చేసుకుని

ఉవ్వెత్తున ఎగసే సంకోచిత
ప్రత్యామ్నాయాలను
విశదీకరించి, విప్పారిన హృదయమున
అంతరార్పణ గావించాలి

ఆకాశము భూమితో ఏకమైన వేళ
అంతరిక్షం అమాంతం అంతమైన వేళ
మిత్రమ ఫలితాలన్నీ మౌనాన్ని ఆవహించిన
వేళ

ఒక్క క్షణమైనా ఉంటుందంటూ
అందమైన ఆశ మళ్ళీ కొత్త రెక్కలు కట్టుకుని
వేధించిన మాటలన్నీ వాస్తవాలై
కనువిప్పుతాయి
కఠికాందకార లోకాన్ని సమస్తం త్యజిస్తాయి

ఆనాడు, ఆ క్షణాన
ఒకరోజు వస్తుంది
రాతను రాసుకోడానికి
నచ్చినట్లు బ్రతకడానికి
జీవనం పునః ప్రారంభం అవ్వడానికి.....

– రచన : పోలగాని భాను తేజశ్రీ



# జనసేన నాయకులు ఆత్మీయ సమావేశం

## - జనసేన పార్టీ బలోపేతంపై ప్రత్యేక చర్చ

కిర్లంపూడి (

ఫిబ్రవరి 14:జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం తామరాడ గ్రామం లో జనసేన ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి లో ముఖ్యమైన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.జగ్గంపేట నియోజక వర్గ కార్యకర్తల ఐక్యత, ప్రజల మద్దతు, యువతలో పెరుగుతున్న స్పందన పార్టీకి ప్రధాన బలం అని పేర్కొన్నారు. ఈ బలాన్ని మరింత విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.అలాగే జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు మండల స్థాయి కమిటీలు మరియు గ్రామ స్థాయి కమిటీలు త్వరితగతిన ఏర్పాటు చేయాలని జనసైనికులు ఇన్చార్జి ని కోరారు. దీనిపై తుమ్మలపల్లి రమేష్ స్పందిస్తూ త్వరలో నాలుగు మండలాలలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రతి గ్రామం నుంచి కష్టపడి పనిచేసిన కార్యకర్తలను మండల కమిటీలలోకి తీసుకుంటామని, అలాగే గ్రామ కమిటీలను కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. నియోజకవర్గంలోని జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. కార్యకర్తల అభిప్రాయాలు, స్థానిక స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, సంస్థాగత బలోపేతానికి అవసరమైన మార్పులు వంటి అంశాలను ఇంచార్జి సమగ్రంగా విన్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అదేవిధంగా, పార్టీ పేరు చెప్పుకుని



కోవర్టులుగా వ్యవహరిస్తున్న వారి జాబితాను పార్టీ నాయకత్వానికి అందజేసినట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.

ఇంకా కొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, యువత మరియు మహిళలను పార్టీలోకి ఆహ్వానించాలని నిర్ణయించారు.ఈ సమావేశం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, తామరాడ ఎంపీటీసీ గోకాడ రాజా, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, జిల్లా కార్యదర్శి సూరంపాలెం బాలు, జిల్లా ప్రోగ్రామ్ ఇంకా ఏమిటి నెంబర్ రామకుర్తి నరసింహం, కిర్లంపూడి మండల అధ్యక్షులు గంధం ప్రభాకర్, ఐటి కోఆర్డినేటర్ అరిణి రాజేష్ గండేపల్లి జనసేన నాయకులు మేడి బోయిన శ్రీను, కుంచె కోటి, జగ్గంపేట మండల అధ్యక్షుడు మరిసే శ్రీరామకృష్ణ, జగంపేట టౌన్ అధ్యక్షుడు గవర సుధాకర్, గండేపల్లి మండల అధ్యక్షుడు గోన శివ, కిర్లంపూడి మండల ఉపాధ్యక్షులు సత్యం శెట్టి గణేష్,నీటి సంఘం చైర్మన్ కాకిలేటి బాబ్జి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ బోర్డ్ మెంబర్లు పిడుగు జయబాబు, మడుగుల బాబ్జి,ఎల్లపు దొరబాబు, పాబోలు స్వామి, మాదారపు వీరబాబు, ఎలుబండి శివ,దాడిచిన బుజ్జి, పల్లా ప్రసాద్, సద్గురు మూర్తి, పదిలం మురళీకృష్ణ,దోసపాటి సుబ్బారావు, గంటా తేజ, కురుమల్ల నాగేశ్వరావు,గుల్లింకాల నాని, గ్రంధి సుబ్రహ్మణ్యం,విష్ణు,గంధం శ్రీను, కుంచె రాజు, గోకేడ ప్రసాద్, పాలెం బాబీ, గోకేడ రమణ,వెంకన్నబాబు నియోజకవర్గ వ్యాప్తంగా భారీ స్థాయిలో పాల్గొన్నారు

# వాహన దారులకు పలు సూచనలు

## - పెదవేగి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజబాబు

ఏలూరు ఫిబ్రవరి 14: ముసునూరు పెదవేగి మండలాల పరిధిలో ఉన్న బలివే రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి,ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పెదవేగి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజబాబు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ని మళ్లించే విధంగా రూట్ మ్యాప్ ను వివరిస్తూ వాహన దారులకు పలు సూచనలు చేశారు, ఏలూరు నుండి బలివే వచ్చే భక్తులు ఏలూరు నుండి ,శనివారపేట,దుగ్గిరాల,కొప్పాక, అంకన్నగూడెం,వేల్పుచెర్ల మీదగా బలివే చేరుకోవాలని తెలిపారు,అదేవిధంగా ఏలూరు నుండి చింతలపూడి వెళ్లే భారీ వాహనాలుఏలూరు నుండి విజయరాయి




చేరుకుని అక్కడనుండి రాయన్న పాలెం రోడ్డుకు డైవర్ట్ అయ్యి రాయన్నపాలెం ,రామచంద్ర పురం అడ్డరోడ్డు కు చేరుకుని చింతలపూడి వెళ్లాలని తెలిపారు, అదేవిధంగా చింతలపూడి నుండి ఏలూరు వెళ్లే వాహనాలు రామచంద్రపురం అడ్డరోడ్డు నుండి రాయన్న పాలెం మీదగా విజయరాయి మీదగా ఏలూరు వెళ్లాలని సూచించారు, పోలీస్ వారి సూచనలు పాటించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని పెదవేగి సి ఐ రాజశేఖర్ శనివారం బలివే లో మెట్రో టివి కిచ్చిన ఇంటర్వ్యూ లో తెలిపారు,సి ఐ వెంట పెదపాడు ఎస్ ఐ ఆర్ శ్రీను,పెదవేగి ఎస్ ఐ ఎమ్ హరి గోపాల్ ఉన్నారు

# తిరుమల తిరుపతి కల్తీ లడ్డు వ్యవహారంపై ప్రజలను మభ్య పెడుతున్న వైసిపి నాయకులు- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి ఫిబ్రవరి 14: బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీడియా సమావేశం ఏర్పాటు చేసి తిరుమల తిరుపతి కల్తీ లడ్డు వ్యవహారంపై ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డిని వైసీపీ నాయకులపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మండిపడ్డారు. కనీసం పాలు కూడా సేకరించని డైరీ తో ఒప్పంద కుదుర్చుకుని టన్నులు కొద్ది కల్తీ నెయ్యిని సరఫరా చేసి తిరుమల లడ్డు పవిత్రతను అపవిత్రం చేశారని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. తమ తప్పులు కప్పుకునేందుకు అంబటి రాంబాబు కొత్త డ్రామాకు స్వీకారం చుట్టాడని దానికి తోడు రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులు




డ్రామాలు రక్తి కట్టిస్తున్నారని అన్నారు హిందువులంతా ఏకమై ఒక తాటి మీదకు వస్తున్నారని దీంతో ప్రతిపక్ష నేత జగన్ కు వణుకు పుట్టిందన్నారు. తిరుమలలో జరుగుతున్న వ్యవహారం మొత్తం దేశవ్యాప్తంగా ఉన్న 100 కోట్ల మంది ప్రజలు చూస్తున్నారని తిరుమల లడ్డులో నెయ్యి కల్తీ జరిగిందో లేదో ప్రజలందరికీ తెలుసని ఇప్పటికైనా తమ తప్పు తెలుసుకుని వైసిపి డ్రామాలు ఆపాలంటూ వైసిపి నాయకులను హెచ్చరించారు.

# దుమ్ముకొట్టుకుపోతున్న రైతు బతుకు పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు

## -నిబంధనలు పాటించని కాంట్రాక్టర్ ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జీలుగుమిల్లి (

ఫిబ్రవరి 14 జీలుగుమిల్లి నుండి పోలవరం వరకు సాగుతున్న నేషనల్ హైవే పనులు రైతుల పాలిట శాపంగా మారాయి అభివృద్ధి పేరుతో వేస్తున్న ఈ రోడ్లు పొలాల్లో ఉన్న పంటలను దుమ్ముతో ముంచెత్తుతుంటే అధికారులు మాత్రం మొద్దునిద్ర పోతున్నారు. సొంత ప్రభుత్వం ఉన్నా, అధికారుల మొండివైఖరిని నిరసిస్తూ తెలుగుదేశం మండల పార్టీ ప్రెసిడెంట్ సుంకవల్లి సాయి స్వయంగా రైతులతో కలిసి జీలుగుమిల్లిలోని రోడ్డుమీద ధర్నాకు దిగడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

నేషనల్ హైవే పనుల వల్ల గాలిలోకి లేస్తున్న విపరీతమైన దుమ్ము వల్ల రోడ్డుకు ఇరుపక్కల ఉన్న పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయి.

రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంట, ఇప్పుడు దుమ్ము కొట్టుకుపోయి దిగుబడి రాక అప్పుల పాలు చేస్తోంది.

రోజుకు కనీసం మూడు, నాలుగు సార్లు నీళ్లు చల్లాలనే కనీస నిబంధనను కాంట్రాక్ట్ సంస్థ గాలికొదిలేసింది.అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం ప్రయాణికులకు ఇబ్బంది జరుగుతుంటే సహించేది లేదు

తక్షణమే దుమ్ము నివారణకు చర్యలు చేపట్టాలి ఉన్నతాధికారులు స్పందించి, ఆ రైతు కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు

కాంట్రాక్టర్ల కాసులు కక్కుర్తికి కాలం చెల్లుతుంది సివిల్ ఇంజనీర్ కుమ్మరి నాగేంద్ర

ఈ ఘటనపై వైయస్సార్సీపి పోలవరం నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు, సివిల్ ఇంజనీర్, కుమ్మరి నాగేంద్ర (టోనీ) స్పందిస్తూ

రోడ్డు నిర్మాణ సంస్థలు మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్ అండ్ హైవేస్ మార్గదర్శకాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 కింద కొన్ని కఠినమైన రూల్స్ ఉన్నాయని మర్చిపోకూడదు అని అన్నారు

నిర్మాణ సమయంలో గాలి నాణ్యత పడిపోకుండా చూడటం కాంట్రాక్టర్ ప్రాథమిక బాధ్యత అని

జన ఆవాసాలు పంట పొలాలు ఉన్న ప్రాంతాల్లో రోజుకు కనీసం 3 నుండి 4 సార్లు ఎండ తీవ్రతను బట్టి మరిన్ని సార్లు వాటర్ ట్యాంకర్లతో నీటిని చల్లాలి అని

ఇసుక, మట్టి, సిమెంట్ వంటి పొడి పదార్థాలను తరలించే వాహనాలపై ఖచ్చితంగా తార్పాలిన్ కవర్లు కప్పాలి అని రోడ్డు పక్కన నిల్వ ఉంచిన మట్టి కుప్పలపై కూడా నీళ్లు చల్లాలి లేదా కవర్ చెయ్యాలి అని రహదారి నిర్మాణ ప్రాంతానికి, పొలాలకు మధ్య అవసరమైతే తాత్కాలికంగా గ్రీన్ నెట్స్ ఏర్పాటు చేయాలి రహదారి కోసం చెట్లను నరికినప్పుడు, దానికి బదులుగా నిర్ణీత సంఖ్యలో మొక్కలు నాటాలి పనులు జరుగుతున్నప్పుడు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా స్పష్టమైన సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఉండాలి.

వాహనాల రాకపోకలను నియంత్రించడానికి శిక్షణ పొందిన వ్యక్తులను నియమించాలి.

జన ఆవాసాల మధ్య రాత్రి పూట భారీ యంత్రాలను





వాడకూడదు. యంత్రాలకు సైలెన్సర్లు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి వీటన్నిటిని పాటించకపోతే తక్షణమే రైతులతో ఆందోళనలు చేస్తామనిఅలాగే నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ (పిడి) కార్యాలయంలో లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ ఫిర్యాదుల పోర్టల్‌లో కంప్లైంట్ రిజిస్టర్ చేయడందుమ్ము వల్ల పర్యావరణానికి, పంటలకు నష్టం జరుగుతోందని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారికి ఫిర్యాదు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరుగుతుంది హెచ్చరించారుఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గద్దె సుబ్రహ్మణ్యం కోలాధర్మరాజు కుందేటి సురేష్ రైతులు ప్రజలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో భారీగా జరుగుతున్న ఏర్పాట్లు

దెందులూరు(


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే బలివే క్షేత్రానికి మెరుగైన రహదారుల నిర్మాణంతోపాటు, 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వ జీవోను విడుదల అయ్యేలా కృషి చేసి బలివే బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, నేడు తిరిగి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బలివే బ్రిడ్జిని సైతం పూర్తి చేసి నూతన ఘాట్లను సైతం నిర్మించి బలివే ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

బలివే క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు అల్పాహారం, చంటి పిల్లలకు పాలు అందించేలా ముమ్మర ఏర్పాట్లుఅలాగే మరోవైపు దాదాపు 25వేల మంది భక్తులకు ఉచితంగా చెరకు రసం అందించేందుకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక ఏర్పాట్లు - ఇప్పటికే 12 టన్నుల చెరకు తరలింపు - నిమ్మ రసంతో కూడిన చెరకు రసాన్ని తీసి వాటిని భారీ టిన్నుల్లో ఐస్ డ్రమ్ముల మధ్య సిద్ధం చేస్తున్న వైనంమహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజాము నుంచే బలివేక్షేత్రం వద్దకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని స్వయంగా అక్కడే ఉండి ఏర్పాట్లను, భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించనున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బలివే మహాశివరాత్రి ఏర్పాటులల్లో ముమ్మరంగా భాగస్వామ్యం అవుతున్న కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు, ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు

## - ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు గారు..

ఏలూరు( ఫిబ్రవరి 14: ఏలూరు నియోజకవర్గ ప్రజలకు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, సోదర సోదరీ మణులకు, కార్మిక, కర్షక శ్రామిక వర్గాలకు, పెన్షనర్లకు, రైతు సోదరులకు, వ్యాపార వాణిజ్య ప్రతినిధులకు, అందరికీ మహా శివరాత్రి పర్వదినం శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు తెలిపారు. “ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. మంచి పరిపాలనను అందిస్తున్న కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, మా ప్రియతమ నాయకులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి, పౌర సరఫరాల మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్ కి, జనసేన, తెలుగుదేశం బిజెపి కూటమి పార్టీల నాయకులకు, నాయకులకు, కార్యకర్తలకు, వీర మహిళలకు, జన సైనికులకు, మెగా అభిమానులకు మహా శివరాత్రి శుభాకాంక్షలు. ఈ పర్వదినం సందర్భంగా ఆ పరమేశ్వరుడు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని ప్రార్థిస్తున్నామన్నారు. అలాగే ఏలూరులో మంచి పరిపాలనను అందిస్తున్న ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు కి, జిల్లా కలెక్టర్ కి, డిప్యూటీ కలెక్టర్ కి పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు, ఏపీఎస్ పీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు అందరికీ పేరుపేరునా మహా శివరాత్రి పర్వదినం శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ఏలూరు నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు.. ఆ పరమేశ్వరుడు ఆశీస్సులతో మీరు తలపెట్టే ప్రతి కార్యం విజయవంతం అవ్వాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని పరమేశ్వరుడిని కోరుకుంటున్నామని అన్నారు..



# అభివృద్ధి, సంక్షేమం బ్లూ ప్రింట్ బడ్జెట్

## -డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి.

జంగారెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి బ్లూ ప్రింట్ గా ఉందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు ఈ సందర్భంగా బడ్జెట్పై ఆయన నోట్ రిలీజ్ చేశారు మొత్తం బడ్జెట్ మూడు లక్షల 32వేల 25 కోట్ల రూపాయలుగా రూపొందించారని దానిలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమాలకి సుమారుగా 91 వేల కోట్ల రూపాయల కేటాయించడం పట్ల ఈ వర్గాలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందని అన్నారు పోలవరానికి 6000 కోట్లకు పైగా కేటాయించడంతోపాటు ఇరిగేషన్ కి 13 వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించడం ద్వారా ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ప్రభుత్వం చూపిస్తున్న చిత్తశుద్ధికి నిదర్శనం అని శేషు అన్నారు. అలాగే వ్యవసాయానికి వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్లో దాదాపు 14 వేల కోట్లు కేటాయించడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ను మొదటి స్థానంలో నిలిపే విధంగా ఉన్నాయని ధరల స్థిరీకరణ కోసం గత బడ్జెట్ కంటే మెరుగ్గా 500 కోట్ల రూపాయలు కేటాయించటం హర్షనీయమని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 830 కోట్లు కేటాయిస్తే టిడిపి కూటమి ప్రభుత్వం రెండు బడ్జెట్లలోనే 800 కోట్లను కేటాయించడం ద్వారా ఈ ప్రభుత్వం తాలూకా చిత్తశుద్ధి తెలుస్తుందని శేషు అన్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్కు 22 వేల కోట్ల రూపాయలు వైద్యానికి సాంకేతిక విజ్ఞానం కోసం అమరావతికి బడ్జెట్లో కేటాయింపులు అద్భుతంగా ఉన్నాయని శేషు పేర్కొన్నారు ఇది కచ్చితంగా విజన్ 247 సాధన దిశగా ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. 25 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని లక్ష్యంతో బడ్జెట్లో కేటాయింపులు చేయటం పేదవారి యొక్క అభివృద్ధి కోసం ప్రభుత్వం ఆలోచించే విధానానికి అద్దం పట్టేలా ఉందని అన్నారు. ఈ బడ్జెట్ అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండిటికి ఒక బ్లూ ప్రింట్ గా ఉందని బడ్జెట్లో కేటాయింపులు బాగున్నాయని వాటిని ఆయా రంగాలకు, వర్గాలకు యధావిధిగా ఖర్చు చేస్తే అద్భుతమైన ప్రగతి సాధ్యమవుతుందని శేషు తెలిపారు.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr